


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 82 | శనివారం 22 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## హర్మూజ్ జలసంధిలో భారత నావికుల నౌక పై ఇరాన్ దాడి..

- పనామా జెండా నౌకపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ రాకెట్ లాంచర్‌తో దాడి
- దాడి సమయంలో నౌకలో 21 మంది
- భారత సిబ్బంది ఉన్నట్లు నిర్ధారణ
- ఇప్పటివరకు జరిగిన దాడుల్లో 15 మంది నావికుల మృతి


2

## గ్రీన్ కార్డు దరఖాస్తుదారులకు అలర్ట్..

### మారిన అప్లికేషన్ ఫామ్.. భారతీయుల పై ప్రభావం!

అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకునే వారికి యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. గ్రీన్ కార్డు కోసం ఉపయోగించే కీలకమైన ఫామ్ I-485లో మార్పులు చేసినట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 18 నుంచి కొత్త ఎడిషన్ ఫామ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా తెలిపింది. ఈ మార్పు తర్వాత పాత ఎడిషన్ ఫారాలు సమర్పిస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించింది.



2

## 26 రోజుల్లో 74 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు



2

- 26వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం
- ఇప్పటివరకు 74.30 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు
- పాలన పై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణే లక్ష్యం

## కొండా ఫ్యామిలీ పై రేవంత్ రెడ్డి సీరియస్..

# చర్యలు తప్పవని హెచ్చరిక!

- క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- కఠిన చర్యలు తప్పవని పార్టీ ముఖ్య నేతలకు స్పష్టం చేసిన సీఎం
- మంత్రి సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పీసీసీ
- సీఎంపై విమర్శలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని గట్టి సంకేతాలు


2

## సున్నం చెరువు రూపురేఖలు మార్చేస్తున్న హైడ్రా..


2

- సర్వాంగ సుందరంగా సున్నం చెరువు
- ఆలయ కమిటీ సహకారంతో ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి
- వాకింగ్ ట్రాక్, పచ్చదనం, ఓపెన్ జిమ్‌లతో పర్యాటక హంగులు
- త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

## నల్లమల అడవి నుంచి శేషాచలం అడవులకు పెద్దపులి ప్రయాణం


2

- పెద్దపులి ఆవాసం కోసం సుదీర్ఘ అడుగులు
- ఓ పెద్దపులి తన ఆవాసం కోల్పోయి వందల కిలోమీటర్లు ప్రయాణం
- నల్లమల నుంచి శేషాచలం అడవుల్లోకి వెళ్లిన ఘటన

## ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయండి

- ఈ నెల 24న ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్
- తన క్యాంప్ కార్యాలయంలో బంద్ పోస్టర్ ను ఆవిష్కరించిన జగదీశ్ రెడ్డి
- ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్



2

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 22 ఆగష్టు 2026

## గ్రీన్ కార్డు దరఖాస్తుదారులకు అలర్ట్.. మారిన అప్లికేషన్ ఫామ్.. భారతీయులపై ప్రభావం!

సెప్టెంబర్ 18 నుంచి కొత్త ఎడిషన్ ఫామ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా తెలిపింది. ఈ మార్పు తర్వాత పాత ఎడిషన్ ఫారాలు సమర్పిస్తే వాటిని తిరస్కరిస్తామని హెచ్చరించింది. యూఎస్‌సీఐఎస్ ప్రకటన ప్రకారం.. 2026 సెప్టెంబర్ 18 ఎడిషన్ తేదీతో ఉన్న కొత్త ఫామ్ I-485, ప్రస్తుతం వాడుకలో ఉన్న 2025 జనవరి 20 ఎడిషన్ ఫామ్ స్థానంలోకి వస్తుంది. ఈ మార్పు విషయంలో ఎలాంటి గ్రేస్ పీరియడ్ (సడలింపు సమయం) ఉండదని ఏజెన్సీ నొక్కి చెప్పింది. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్‌ను పోస్ట్ చేసిన తేదీ (పోస్ట్‌మార్క్) లేదా ఆన్‌లైన్‌లో సమర్పించిన తేదీ ఆధారంగా సరైన ఎడిషన్ ఫామ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది.

**నిబంధనలు ఇవే:**

సెప్టెంబర్ 18 లోపు సమర్పించే దరఖాస్తులకు 2025 జనవరి 20 ఎడిషన్ ఫామ్‌ను ఉపయోగించవచ్చు. యూఎస్‌సీఐఎస్ వీటిని అంగీకరిస్తుంది. అయితే, సెప్టెంబర్ 18 లేదా ఆ తర్వాత పాత ఎడిషన్ (2025 జనవరి 20) ఫామ్‌తో దరఖాస్తు చేస్తే, దానిని పరిశీలించకుండానే తిరస్కరిస్తారు. అదేవిధంగా సెప్టెంబర్ 18కి ముందే కొత్త ఎడిషన్ ఫామ్‌ను సమర్పించకూడదు. కొత్త ఫామ్‌ను కేవలం సెప్టెంబర్ 18 లేదా ఆ తర్వాత తేదీల్లో మాత్రమే అంగీకరిస్తారు. ఈ కఠినమైన నిబంధనల వల్ల దరఖాస్తుదారులు, వారి ఇమ్మిగ్రేషన్ లాయర్లు ఫైలింగ్ తేదీ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. తప్పుడు ఎడిషన్ ఫామ్ వాడితే, దరఖాస్తులోని అర్హతలను పరిశీలించకముందే అది తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది.

**మార్పులకు కారణం ఏమిటి?**

'పబ్లిక్ ఛార్జ్' నిబంధనకు సంబంధించి ఇటీవల ప్రకటించిన తుది నిబంధనలకు అనుగుణంగా ఫామ్ I-485ను సవరించినట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది. ఒక దరఖాస్తుదారు భవిష్యత్తులో జీవనోపాధి కోసం ప్రభుత్వంపై ఆధారపడే అవకాశం ఉందా లేదా అని అంచనా వేయడానికి ఈ 'పబ్లిక్ ఛార్జ్' నిబంధనను ఉపయోగిస్తారు. అమెరికాలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ నిబంధన అప్లికేషన్ విధానంలో మార్పులు చోటుచేసుకోవడం, వివాదాస్పదం కావడం సాధారణంగా జరుగుతుంటుంది. ఈ మార్పు ముఖ్యంగా గ్రీన్ కార్డు కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయులపై ప్రభావం చూపనుంది. అమెరికాలోని టెక్నాలజీ, మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి రంగాల్లో భారతీయ నిపుణులు అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే, ఏటా విధించే దేశాలవారీ కోటా పరిమితుల కారణంగా వీరు గ్రీన్ కార్డు పొందడానికి చాలా కాలం వేచి ఉండాల్సి వస్తోంది. ఫామ్ I-485 దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు, దరఖాస్తుదారులు తాత్కాలికంగా ఉద్యోగం చేసుకోవడానికి, దేశంలో ప్రయాణించడానికి అనుమతులు పొందే అవకాశం ఉంటుంది. ఈ తాజా మార్పుల నేపథ్యంలో దరఖాస్తుదారులు యూఎస్‌సీఐఎస్ వెబ్‌సైట్‌ను సందర్శించి, కొత్త ఫామ్ ప్రివ్యూ, సూచనలను క్షుణ్ణంగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైలింగ్ ఫీజులో ఎలాంటి మార్పులు చేసినట్లు యూఎస్‌సీఐఎస్ ప్రస్తుతానికి ప్రకటించలేదు.

## హర్మూజ్ జలసంధిలో భారత నావికుల నౌక పై ఇరాన్ దాడి..

హర్మూజ్ జలసంధిలో భారత నావికులు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులను కళ్లకు కడుతూ ఓ పాత వీడియో ఇప్పుడు మళ్లీ వెలుగులోకి వచ్చింది. 2026 ఏప్రిల్ 22న జరిగిన ఈ ఘటనలో, 21 మంది భారత సిబ్బందితో ప్రయాణిస్తున్న పనామా జెండాతో కూడిన 'యూఫోరియా' అనే కంటైనర్ నౌక పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దళాలు దాడి చేశాయి. ఈ వీడియోలో, ఐఆర్‌జీసీకి చెందిన చిన్న పడవలు సరుకు రవాణా నౌకను చుట్టుముట్టడం, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్‌తో దాడి చేయడం వంటి దృశ్యాలు రికార్డయ్యాయి. దాడి తీవ్రమవడంతో, ప్రాణభయంతో భారత నావికులు నౌకలోని సన్నని మార్గాల్లో (అల్లేవేస్) తలదాచుకోవడం కనిపించింది. ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ఈ ఫుటేజీని విడుదల చేస్తూ "దాడి చేసింది సముద్రపు దొంగలు కాదు, ఐఆర్‌జీసీకి చెందిన నౌకాదళ బలగాలు" అని స్పష్టం చేసింది. అదృష్టవశాత్తూ, ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని, వారంతా సురక్షితంగా ఉన్నారని భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ఆ తర్వాత ధ్రువీకరించింది. 2026 ఫిబ్రవరిలో ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ వివాదం మొదలైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఈ నౌకాయాన మార్గంలో ఇటు ఇరాన్, అటు అమెరికా బలగాలు వాణిజ్య నౌకల పై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం, ఈ ఘర్షణలు మొదలైనప్పటి నుంచి జరిగిన దాడుల్లో సుమారు 15 మంది నావికులు ప్రాణాలు కోల్పోగా, వీరిలో చాలామంది భారతీయులే ఉన్నారు. ప్రపంచ నావికుల్లో 12 శాతం మంది భారతీయులే ఉన్న నేపథ్యంలో, వారి భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఇరాన్, అమెరికాల వద్ద తన నిరసనను వ్యక్తం చేసింది.ఆ ప్రాంతంలో భారత నావికులు ఎదుర్కొంటున్న ముప్పును మరోసారి గుర్తుచేస్తోంది.

# కొండా ఫ్యామిలీ పై రేవంత్ రెడ్డి సీరియస్.. చర్యలు తప్పవని హెచ్చరిక!

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పర్యటన నుంచే ముఖ్య నేతలకు ఆయన గట్టి హెచ్చరికలు పంపినట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పరకాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తద్వారా రేవూరి అభ్యర్థిత్వాన్ని దాదాపు ఖరారు చేస్తూ స్పష్టమైన సంకేతాలిచ్చారు. అయితే, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేసేలా.. ఆ మరుసటి రోజే మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. సీఎం పర్యటనకు స్థానిక మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరు కావడం, ఆ వెంటనే ఆమె కుమార్తె ఈ వ్యాఖ్యలు చేయడం ఒక ప్రణాళిక ప్రకారమే జరిగిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ఈ పరిణామాలపై బుధవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్.. అక్కడే కొందరు ముఖ్య నేతల వద్ద తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరికొందరు సీనియర్ మంత్రులతో ఫోన్‌లో మాట్లాడి, ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు చెప్పారని సమాచారం. సీఎం ఆదేశాల మేరకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ వెంటనే రంగంలోకి దిగింది. మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కోరింది. అయితే, "కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నేనెలా బాధ్యురాలిని అవుతాను?" అని మంత్రి సురేఖ గురువారం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించుకోవడం సరికాదు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. మంత్రి సురేఖ వివరణను పరిశీలించాక తదుపరి చర్యలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని స్పష్టం చేశారు.

# 26 రోజుల్లో 74 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం- 2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి ఈ కార్యక్రమం 26వ రోజుకు చేరుకుంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 74.30 లక్షల ఇళ్లను పార్టీ నాయకులు, కార్యకర్తలు సందర్శించినట్లు తెలుగుదేశం పార్టీ ఓ ప్రకటనలో వెల్లడించింది. కేవలం శుక్రవారం ఒక్కరోజే 2,50,129 కుటుంబాలను కలిసినట్లు పేర్కొంది. పార్టీ శ్రేణులు ప్రతి గడపకూ వెళ్లి, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకుంటున్నాయి. ఈ సందర్శనల సందర్భంగా, రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను, సంక్షేమ పథకాల వివరాలను ఆయా కుటుంబాలకు నేతలు వివరిస్తున్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నట్లు పార్టీ తెలిపింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యం అవుతున్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నల్లమల అడవి నుంచి శేషాచలం అడవులకు పెద్దపులి ప్రయాణం

**ఆత్మకూరు ఆగస్టు 21 వార్త సాక్ష్యం**

శ్రీశైలం - నాగార్జునసాగర్ పులుల అభయారణ్యం పరిధిలోని తెలంగాణ రాష్ట్రం అమ్రాబాద్ అభయారణ్యం నుంచి ఓ పెద్దపులి తన ఆవాసం కోల్పోయి కృష్ణా నది దాటి నంద్యాల జిల్లా పరిధిలోని రాజీవ్ అభయారణ్యంలోకి, అక్కడి నుంచి గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యంలోకి ప్రవేశించింది.అయితే ఇక్కడ కూడా తనకు ఆవాసం దొరకకపోవడంతో కడప జిల్లాలోని లంకమల అడవులకు ప్రయాణించింది. అక్కడ కూడా ఆవాసం దొరకకపోవడంతో ప్రస్తుతం శేషాచలం అడవుల్లో ట్రాప్ కెమెరాలకు చిక్కినట్లు సమాచారం. మొట్టమొదటిసారిగా శేషాచలం అడవుల్లో పెద్ద పులి తిరుగుతున్నట్లు తెలుపుతున్న ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

**-స్థానం కోసం పోరాటం**

ఒక మగ పులి 400 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని తన నివాస ప్రాంతంగా (టెరటరీ ) ప్రకటించుకుంటుంది. ఆ ప్రాంతంలో సుమారు ఆరు ఆడ పులులు ఉంటాయి.మగ పెద్దపులి తన ఒక టెరిటరీని రక్షించుకోవడంలో ఇతర పులులతో నిరంతరం పోరాటం చేయాల్సి వస్తుంది. ఈ పోరాటంలో ఓడిపోతే మరణం తప్పదు. లేదంటే తన స్థానం గెలిచినపులికి టెరటరిని అప్పగించి మరోచోటుకు వెళ్లాల్సిందే. ఇటీవల ఒక పెద్ద పులి తెలంగాణలోని అమ్రాబాద్ అభయారణ్యంలో తన స్థావరం వీడి కృష్ణా నదిని దాటి రాజీవ్ గాంధీ అభయారణ్యం (ఎన్ఎస్ టి ఆర్) లో కి వచ్చింది. అక్కడ దానికి చోటు లభించకపోవడంతో మెల్లగా గుండ్లబ్రమేశ్వరం వన్యప్రాణి అభయారాణ్యంలోకి ప్రవేశించింది.అక్కడ స్థిరపడకపోతే లంకమల అడవులకు, అక్కడి నుండి శేషాచలం అడవుల్లోకి ప్రవేశించింది. అక్కడ ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలు పెద్దపులి కనిపించినట్లు ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు.

**-పెరిగిన పెద్దపులల సంతతి**



నాగార్జునసాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వులో 2014- 15 సంవత్సరంలో 37 పెద్ద పులులు ఉండగా వాటి సంఖ్య క్రమేపి పెరుగుతూ 2024 -25 పులి గణాంకాల ప్రకారం 87కు చేరింది. 2026లో 128 వరకు చేరినట్లు అంచనా . పెద్దపులుల సంతతి పెరుగుతుండడంతో ఇటీవల ప్రభుత్వం నల్లమల, లంకమల, శేషాచలం అడవులను కలుపుతూ ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేసింది.. పెద్దపులి శేషాచలం వరకు విస్తరించడంతో ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..

శేషాచలం అడవుల్లో పెద్దపులులు గతంలో (2019, 2021 మరియు 2025లలో) శేషాచలం మరియు కడప జిల్లా చిట్వేలి సరిహద్దు ప్రాంతాల్లో పులి అడుగుజాడలు లేదా స్వల్ప కదలికలు కనిపించినప్పటికీ, వెంకటగిరి/తిరుపతి లోపలి శేషాచల కోర్ అటవీ ప్రాంతంలో కెమెరా ట్రాప్కు చిక్కడం ఇదే మొదటిసారి

# ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ ను విజయవంతం చేయండి

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న చేపట్టబోయే ఆటో కార్మికుల రాష్ట్ర వ్యాప్త బంద్ పోస్టర్‌ను బీఆర్‌టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లతో కలిసి సూర్యాపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-ఆటోలను కేటాయించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించు కోవాలని, ఆటో కార్మికుల రక్షణకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచడంతో పాటు ఓలా, ఉబర్, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే సొంతంగా యాప్‌ను ప్రారంభించాలని సూచించారు. బైక్ టాక్సీల అక్రమ రవాణాను అరికట్టాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు వారిని ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల ఆటోల అక్రమ రవాణాను అరికట్టాలని, వాహన సారథి లైసెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ జీవో 60 ప్రకారం రేడియం స్టిక్కరింగ్ నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రమాద బీమాతో పాటు సాధారణ మరణాలకు కూడా బీమా వర్తింపజేయాలని, 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 24న నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# సున్నం చెరువు రూపురేఖలు మార్చేస్తున్న హైడ్రా..

హైదరాబాద్ నగరంలోని సున్నం చెరువు రూపురేఖలు సమూలంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు మురికికూపంగా, దుర్వాసనతో అల్లాడిన ఈ చెరువును 'హైడ్రా' సుందర సరోవరంగా తీర్చిదిద్దుతోంది. త్వరలోనే ఈ చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవైపు బోరబండ బస్తీ, మరోవైపు ఐటీ కారిడార్ మధ్య ఉన్న ఈ చెరువు గతంలో ఆక్రమణల కారణంగా కేవలం 14.20 ఎకరాలకు కుంచించుకుపోయింది. అయితే, హైడ్రా అధికారులు నివాస గృహాలను ఏమాత్రం ప్రభావితం చేయకుండానే, కేవలం కబ్జాలను తొలగించి చెరువును తిరిగి 30.5 ఎకరాలకు విస్తరించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో పాటు, సుమారు 3 మీటర్ల మేర పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ఫలితంగా దుర్వాసన మాయమై, పరిసర ప్రాంత ప్రజలకు ఉపశమనం లభించింది. చెరువు ఆవరణలోని ఆంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా హైడ్రా చేపట్టింది. ఆలయ కమిటీ ప్రతినిధుల సూచనల మేరకు గోపురం, ప్రదక్షిణ మార్గం, భక్తులు కోసం మార్బుల్ గెజిబో వంటి అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. కాగా, ఈ ఆలయాన్ని తొలగిస్తున్నారంటూ కొందరు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను తాము స్వాగతిస్తున్నామని వారు స్పష్టం చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం క్రీడా స్థలాలు, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వీటితో పాటు బోటింగ్ సౌకర్యం, సోలార్ లైటింగ్, పటిష్ఠమైన ఫెన్సింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నివసిస్తున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# సంపాదకీయం

## ఆహా.. నేను ఒక్కరోజు ప్రధానినైతే!



భారతదేశం 80వ స్వాతంత్ర్య సంవత్సరంలోకి ప్రవేశించిన శుభ తరుణమిది. ఈ గొప్ప దేశానికి నేను ఒకే ఒక్క రోజు ప్రధానమంత్రిగా ఉన్నా ఎర్రకోట ప్రాకారం నుంచి నేను వెలువరించే స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఎలా ఉండాలో ఊహించేందుకు సాహసించాను. ఆ ఆలోచనా ఫలితమే ఇది:ఈ రోజు నేను కేవలం ఒక ప్రధానమంత్రిగా కాకుండా మీ ప్రధాన సేవకుడిగా ఇక్కడ నిలబడ్డాను. ప్రధాన సేవకుడు అనే మాటను మీరు వినే ఉంటారని నాకు తెలుసు. అయితే నేను చెప్పినవి చేస్తాను, వాగ్దానాలు నెరవేరుస్తాను. పదవీ బాధ్యతలు చేపట్టిన నెలరోజులలోనే నేను, నా మంత్రులు అందరూ తమ సువిశాల అధికారిక లుట్యెన్స్ బంగ్లాల నుంచి చిన్న గృహాలకు మారాలని నిర్ణయించాను. అనవసర విదేశీ యాత్రలను విరమిస్తాను. అవార్డు ప్రదానాల కార్యక్రమాలకు వెళ్లకూడదని నిశ్చయించుకున్నాను. ప్రభుత్వ హోర్డింగులు, బిల్లు బోర్డులు, వాణిజ్య ప్రకటనల్లో నా బొమ్మ ఉండకూడదని నా పార్టీకి సూచించాను, ముఖ్యమంత్రులందరికీ ఆదేశాలు జారీ చేశాను. వ్యక్తిపూజకు రోజులు చెల్లిపోయాయి. ప్రజాస్వామ్యమనేది ఏకవ్యక్తి ప్రదర్శన ఎంత మాత్రం కాదు.. ప్రధానమంత్రి పదవి తాత్కాలికమే. గణతంత్ర రాజ్యమే శాశ్వతం. ఈ శుభవేళ మరో వాగ్దానం చేస్తున్నాను. భారత ప్రభుత్వం ఏ ఒక్క నిర్దిష్ట మతంతోనూ తనను తాను గుర్తించుకోదు. నేను మతాన్ని పాటిస్తాను. అయితే ఆ మతాచరణలు నా ఇంటికీ, మనస్సాక్షికి మాత్రమే పరిమితం. ప్రధానమంత్రిగా నాకు ఒకే ఒక్క పవిత్ర గ్రంథం ఉన్నది: భారత రాజ్యాంగం. అవినీతిని తుదముట్టించేందుకు నిశ్చయించుకున్నాను.

ఈ స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ జెన్‌జీకి ఒక విషయాన్ని సూటిగా చెప్పదలుచుకున్నాను. మిమ్ములను తప్పుగా అర్థం చేసుకున్నందుకు క్షమాపణలు చెబుతున్నాను. ప్రశ్నపత్రాల లీక్‌లు, ఉద్యోగాల అలభ్యతపై మీ ఆగ్రహం, అసంతృప్తి ఎంత తీవ్రంగా ఉన్నాయో మేము తక్కువగా అంచనా వేశాము. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, సోషల్ మీడియా పోస్ట్‌లు, హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా మీకు సన్నిహితమవచ్చని భావించాము. అది తప్పు అని అర్థమయింది. యువజనులు నిరసనగా వీధుల్లోకి వచ్చినప్పుడు ఒక ప్రజాస్వామిక వ్యవస్థ మొదటి ప్రతిస్పందన వారు మౌనం వహించేలా చేయడం కాదు, లేదా వారిని 'దిమాగి నక్సల్స్'గా, దేశద్రోహులుగా చూడడం అంతకంటేకాదు, యువత సమస్యలను సానుభూతితో వినడమూ, పట్టించుకోవడమే. స్వాతంత్ర్య శతాబ్ది(2047) నాటికి అందరికీ ఉద్యోగాలు లభించేలా చేయడమే నా లక్ష్యం. కృత్రిమ మేధ లక్షలాది ఉద్యోగాలను హరించివేస్తోంది. పని ప్రదేశం తీరుతెన్నులను ఆటోమేషన్ మార్చివేస్తోంది. అయితే ప్రతి సాంకేతిక విప్లవమూ కొత్త అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఆ నూతన అవకాశాలను అందిపుచ్చుకునేలా యువజనులను మనం సంసిద్ధపరచవలసిన అవసరమున్నది. 1991లో ఆర్థిక వ్యవస్థను సరళీకరించి అపూర్వ అభివృద్ధిని సాధించాము. 2026లో మన ఆలోచనలను సరళీకరించుకోవల్సిన సమయం ఆసన్నమయింది. నాకు సన్నిహితులుగా పరిగణన అవుతున్న ఏ వ్యాపారవేత్తకూ అనుకూలంగా నిర్ణయాలు తీసుకోనని మీకు హామీ ఇస్తున్నాను.

భారతీయ మహిళలకు నా సందేశం ఏమిటంటే బేటీ బచావో, బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలకు చదువు చెప్పండి) అనేది ఒక శక్తిమంతమైన నినాదం. అయితే ప్రభుత్వాల పాలనా దక్షతను నినాదాల ప్రాతిపదికన నిర్ణయించకూడదు. చేపట్టిన కార్యక్రమాలు సాధించిన ఫలితాల ఆధారంగానే ప్రభుత్వాల పనితీరుపై తీర్పు ఇవ్వాలి. ఇక నుంచి ప్రతి ఎన్నికలలోను 50శాతం టిక్కెట్లను మహిళలకే ఇవ్వాలని నా పార్టీ స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకున్నది. సాధికారత గురించిన ప్రసంగాలు మహిళలకు అవసరం లేదు. వారికి భద్రత, అవకాశాలు, సమాన అధికారాలు అవసరం. వీటిని తక్షణమే కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

# ఒక ఊరు అంటే కేవలం-ఇళ్ళు కాదు ఒక జీవితం..!





**-కన్న ఊరును... ఉన్న ఊరును వదిలి వెళుతూ కన్నీరు పెడుతున్న వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామస్తులు**
**న్యాయవాది కోడి మోహన్ రావు**

ఒక మనిషికి తన ఊరు అంటే కేవలం నాలుగు గోడలు, కొన్ని వీధులు, పొలాలు, చెట్లు మాత్రమే కాదు. అక్కడే అతని బాల్యం ఉంటుంది. అక్కడే తల్లిదండ్రుల జ్ఞాపకాలు ఉంటాయి. అక్కడే పుట్టిన బంధాలు, పెరిగిన అనుబంధాలు, ఆడిన ఆటలు, చదువుకున్న పాఠశాల, పెళ్లిళ్లు, పండుగలు, పూర్వీకుల జ్ఞాపకాలు ఉంటాయని వ్యాసకర్త కోడి మోహన్ రావు వ్యాఖ్యానించారు అందుకే ఒక మనిషిని తన ఊరును విడిచిపెట్టి వెళ్లమంటే, అతను కేవలం ఒక ఇంటిని కాదు---తన జీవితంలోని ఒక అధ్యాయాన్ని వదిలి వెళ్లాల్సి వస్తుంది. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజల పరిస్థితి కూడా ఇలాంటి భావోద్వేగ వేదనతో నిండిపోయింది. అభివృద్ధి కోసం ప్రాజెక్టులు అవసరమే. నీరు, సాగు, తాగునీరు, కరువు నివారణ వంటి లక్ష్యాల కోసం నిర్మించే ప్రాజెక్టులు వేలాది కుటుంబాలకు భవిష్యత్తును అందిస్తాయి. కానీ ఆ అభివృద్ధి కోసం తమ పుట్టిన ఊరును, పూర్వీకుల ఇళ్లను, పొలాలను, దేవాలయాలను, చెట్లను, జ్ఞాపకాలను వదిలి వెళ్లాల్సి వస్తున్న ముంపు గ్రామస్తుల కన్నీటిని కూడా సమాజం అర్థం చేసుకోవాలి.

**-పుట్టిన నేలను వదిలే బాధ**

"ఈ ఇల్లు మా తాత కట్టింది... ఈ గడప దాటే ప్రతి అడుగులో మా కుటుంబ జ్ఞాపకం ఉంది" అని చెప్పుకునే కుటుంబాలు ఎన్నో ఉంటాయి. ఒక ఇంటి గోడలకు రంగు మార్చవచ్చు. కొత్త ఇంటిని నిర్మించవచ్చు. కానీ ఆ గోడల మధ్య గడిచిన బాల్యాన్ని, ఆ గడప దగ్గర నిలిచిన తల్లిదండ్రులను, ఆ ఇంట్లో జరిగిన శుభకార్యాలను తిరిగి నిర్మించలేం.

ముంపు గ్రామస్తులు తమ ఇళ్లను ఖాళీ చేస్తూ బయటకు వస్తున్నప్పుడు వారి కళ్ల ముందు తమ జీవితమంతా కదులుతుంది. నిన్నటి వరకు తమదైన వీధి, తమదైన పొలం, తమదైన బడి, తమదైన దేవాలయం---ఇవన్నీ ఇక తమకు దూరమవుతాయని ఆలోచిస్తే హృదయం భారమవుతుందనిన్యాయవాది కోడి మోహన్ రావు వెలుగొండ ప్రాజెక్టు లోయపల్లెల గ్రామలైన గుండం చర్ల, కలనూతల, సుంకేసుల గొట్టిపడియా తదితర గ్రామాల ప్రజల మనోవేదనను తెలియజేశారు.వెళ్లాల్సిన దారి ముందుంది. కానీ వెనక్కి చూసిన ప్రతిసారీ కనిపించేది తమ గతం.

**-కన్న ఊరు... ఉన్న ఊరు**

మనిషి పుట్టిన ఊరు అతని "కన్న ఊరు". జీవనోపాధి కోసం స్థిరపడిన ఊరు అతని "ఉన్న ఊరు". రెండు ఊర్లతోనూ మనిషికి అనుబంధం ఏర్పడుతుంది. కానీ ముంపు ప్రాంత ప్రజలకు ఈ రెండు అనుబంధాలూ ఒక్కసారిగా తెగిపోతున్నాయి వారు వెళ్లేది కొత్త ప్రాంతానికి కావచ్చు. అక్కడ ప్రభుత్వం ఇచ్చే పునరావాస గృహం ఉండవచ్చు. రోడ్డు ఉండవచ్చు. విద్యుత్ ఉండవచ్చు. నీటి సదుపాయం ఉండవచ్చు. కానీ పాత ఊరి ఆత్మ అక్కడ ఉండదు.

కొత్త ఇంటి గోడలు ఉంటాయి ...
కానీ పాత ఇంటి జ్ఞాపకాలు ఉండవు
కొత్త వీధి ఉంటుంది...
కానీ చిన్ననాటి స్నేహితుల అడుగుల ముద్రలు ఉండవు.
కొత్త పొలం దొరకవచ్చు...
కానీ పూర్వీకుల భూమిపై ఉన్న ఆత్మీయత దొరకడం కష్టం.

**-పూర్వీకుల జ్ఞాపకాలను ఎలా తరలించాలి ?**

ముంపు గ్రామాల్లో తరతరాలుగా నివసించిన కుటుంబాలకు పూర్వీకుల జ్ఞాపకాలు ఎంతో విలువైనవి. కొందరి తాతలు, ముత్తాతలు అక్కడే పుట్టారు. కొందరి కుటుంబాలకు దశాబ్దాల చరిత్ర అక్కడే ఉంది. పాత ఇల్లు కూలిపోయినా దాని జ్ఞాపకం మిగులుతుంది. కానీ నీటిలో మునిగిపోయిన తర్వాత ఆ ఇంటిని తిరిగి చూడటానికి కూడా అవకాశం ఉండదు. పూర్వీకుల సమాధులు, కుటుంబ దేవతల ఆలయాలు, గ్రామ దేవతల గుళ్లు, చెరువులు, బావులు, వాగులు---ఇవి అన్నీ వారి జీవితంలో భాగం. ఒక కుటుంబానికి ఆస్తి విలువను డబ్బుతో లెక్కించవచ్చు. కానీ ఒక ఊరితో ఉన్న అనుబంధానికి ధర నిర్ణయించగలమా?

**-పొలాలతో ఉన్న బంధం**

గ్రామీణ కుటుంబానికి భూమి కేవలం ఆస్తి కాదు. అది జీవనాధారం. ఆ నేలలో తండ్రి చెమట ఉంటుంది. తల్లి కష్టం ఉంటుంది. పిల్లల భవిష్యత్తు ఉంటుంది.

ఒక రైతు తన పొలాన్ని చూసినప్పుడు కేవలం ఎకరాలు కనిపించవు. విత్తిన విత్తనం, మొలకెత్తిన పంట, వర్షం కోసం ఎదురుచూసిన రోజులు, పంట కోసిన ఆనందం---అన్నీ గుర్తుకొస్తాయి. అలాంటి భూమిని వదిలి వెళ్లడం రైతుకు ఎంతో బాధాకరం.

ప్రభుత్వం పరిహారం ఇవ్వవచ్చు. ప్రత్యామ్నాయ భూమి ఇవ్వవచ్చు. పునరా వాసం కల్పించవచ్చు. కానీ సంవత్సరాలుగా సాగు చేసిన నేలతో ఏర్పడిన భావోద్వేగ బంధాన్ని డబ్బుతో పూర్తిగా భర్తీ చేయడం సాధ్యం కాదు.

**-పండుగలు... జాతరలు... గ్రామ జీవితం**

ఒక గ్రామానికి ప్రత్యేకమైన పండుగలు ఉంటాయి. గ్రామ దేవత జాతర, సంక్రాంతి సంబరాలు, ఉగాది, దసరా, దీపావళి---ప్రతి పండుగకు ఒక ప్రత్యేక జ్ఞాపకం ఉంటుంది. పండుగ రోజుల్లో అందరూ ఒకచోట చేరడం, బంధువులు రావడం, పిల్లలు ఆటలు ఆడటం, పెద్దలు కబుర్లు చెప్పుకోవడం---ఇవన్నీ గ్రామీణ జీవనానికి అందమైన గుర్తులు. ముంపు గ్రామస్తులు కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఆ సమూహ జీవనం విడిపోవడం ఒక పెద్ద సమస్య. ఒకే గ్రామానికి చెందిన కుటుంబాలు ఒకే చోట పునరావాసం పొందకపోతే సామాజిక బంధాలు కూడా బలహీనపడే అవకాశం ఉంది.

అందుకే పునరావాసం అంటే కేవలం ఇల్లు ఇవ్వడం కాదు. ఒక గ్రామాన్ని సామాజికంగా పునర్నిర్మించడం అని కోడి మోహన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

**-కొత్త ఊరిలో కొత్త జీవితం**

ముంపు గ్రామాల ప్రజలు కొత్త ప్రాంతానికి వెళ్లిన తర్వాత ఎన్నో ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.
పిల్లలు ఏ పాఠశాలలో చదవాలి?
రైతులు ఎక్కడ వ్యవసాయం చేయాలి?
కూలీలు ఎక్కడ పని పొందాలి?
చిన్న వ్యాపారులు తమ వ్యాపారాన్ని ఎలా కొనసాగించాలి?
వృద్ధులు తమకు పరిచయం లేని ప్రాంతంలో ఎలా జీవించాలి?
ఇవి సాధారణ ప్రశ్నలు కావు. ప్రతి కుటుంబ భవిష్యత్తును నిర్ణయించే ప్రశ్నలు.

అందుకే పునరావాస ప్యాకేజీలో ఇల్లు, పరిహారం మాత్రమే కాకుండా ఉపాధి, విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, సామాజిక భద్రత వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

**-వృద్ధుల కన్నీళ్లు**

ఈ పరిస్థితిలో ఎక్కువగా బాధపడేవారు వృద్ధులు.
"నా జీవితమంతా ఈ ఊరిలోనే గడిచింది. చివరి రోజుల్లో నా ఊరును చూడకుండా ఎలా వెళ్లాలి?" అనే ప్రశ్న వారి మనసులో ఉంటుంది.

పిల్లలు కొత్త జీవితాన్ని ప్రారంభించగలరు. యువత కొత్త ప్రాంతానికి వెళ్లి ఉపాధి వెతుక్కోగలదు. కానీ జీవితాంతం ఒకే నేలతో అనుబంధం ఏర్పరచుకున్న వృద్ధులకు పునరావాసం చాలా కఠినమైన అనుభవం.

వారి కోసం పునరావాస ప్రాంతాల్లో ప్రత్యేకమైన సామాజిక, వైద్య, మానసిక సహాయక వ్యవస్థలు ఉండాలి.

**-పిల్లల భవిష్యత్తు**

ముంపు ప్రాంతాల పిల్లలపై కూడా ఈ మార్పు ప్రభావం చూపుతుంది. వారు తమ స్నేహితులను, పాఠశాలను, ఆటస్థలాలను వదిలి కొత్త ప్రాంతానికి వెళ్లాల్సి రావచ్చు. అయితే ఇదే సమయంలో వారికి కొత్త అవకాశాలు కూడా కల్పించాలి. మంచి పాఠశాలలు, డిజిటల్ విద్య, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తే పునరావాసం వారి భవిష్యత్తుకు కొత్త బాట వేయగలదు.

**-అభివృద్ధి ఎవరి కోసం?**

వెలుగొండ వంటి ప్రాజెక్టులు ప్రాంత అభివృద్ధికి, సాగునీటి విస్తరణకు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడే లక్ష్యంతో చేపట్టబడతాయి. ఒక ప్రాంతానికి నీరు అందడం అంటే రైతులకు కొత్త ఆశలు రావడం. కరువు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊపిరి రావడం. అయితే ఒక ముఖ్యమైన ప్రశ్నను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు: "అభివృద్ధి ఫలాలను పొందే ప్రజలతో పాటు, ఆ అభివృద్ధి కోసం తమ ఇళ్లను వదిలే ప్రజలకు న్యాయం జరుగుతోందా?" ఈ ప్రశ్నకు సమాధానం ప్రభుత్వ విధానాల్లోనే కాదు, అమలులో కనిపించాలి.

**-న్యాయమైన పునరావాసమే నిజమైన అభివృద్ధి**

ముంపు గ్రామస్తులకు పరిహారం చెల్లించడం ఒక బాధ్యత. కానీ అంతటితో ప్రభుత్వ బాధ్యత ముగియదు. పునరావాసం సమగ్రంగా ఉండాలి. ప్రతి కుటుంబానికి తగిన పరిహారం, సురక్షితమైన నివాసం, జీవనోపాధికి ప్రత్యామ్నాయం, పిల్లలకు విద్య, కుటుంబాలకు వైద్య సదుపాయం, రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ప్రజా రవాణా వంటి సదుపాయాలు అందుబాటులో ఉండాలి. అదే సమయంలో గ్రామాల సామాజిక నిర్మాణం కూడా సాధ్యమైనంతవరకు కొనసాగించాలి. ఒకే గ్రామానికి చెందిన ప్రజలను వీలైనంత వరకు ఒకే పునరావాస ప్రాంతంలో లేదా సమీప ప్రాంతాల్లో స్థిరపరచడం వల్ల వారి పరస్పర సహకారం కొనసాగుతుంది.

**-ముంపు గ్రామాల చరిత్రను కాపాడాలి**

నీటిలో ఒక గ్రామం మునిగిపోయినా దాని చరిత్ర మునిగిపోకూడదు.

ఆ గ్రామం ఎప్పుడు ఏర్పడింది? ఎన్ని తరాలు అక్కడ జీవించాయి? ఏ పండుగలు జరుపుకున్నారు? ఏ చెరువులు, దేవాలయాలు, పాఠశాలలు ఉన్నాయి? గ్రామానికి చెందిన ప్రముఖులు ఎవరు? గ్రామ ప్రజల జీవన విధానం ఎలా ఉండేది? ఇలాంటి సమాచారాన్ని భద్రపరచాలి. పాత ఫొటోలు, పత్రాలు, గ్రామ చరిత్ర, దేవాలయాల వివరాలు, ప్రజల జ్ఞాపకాలను డిజిటల్ రూపంలో భద్రపరిస్తే భవిష్యత్ తరాలకు ఆ గ్రామాల చరిత్ర అందుతుంది.

**-కన్నీటి వెనుక ఒక ఆశ**

ముంపు గ్రామస్తుల కళ్లలో కన్నీరు ఉన్నప్పటికీ వారి హృదయంలో ఒక ఆశ కూడా ఉంది."మా ఊరు పోయినా... మా పిల్లల భవిష్యత్తు బాగుండాలి." "మా ఇల్లు పోయినా... మా కుటుంబం సురక్షితంగా ఉండాలి." "మా పొలం పోయినా... మా జీవనోపాధి కొనసాగాలి." అనే ఆశ వారికి కొత్త జీవితాన్ని ప్రారంభించే ధైర్యాన్ని ఇస్తుంది ఆ ఆశను ప్రభుత్వం నిజం చేయాలి. పునరావాసం కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలి.

**-ముగింపు**

వ్యాసకర్త, న్యాయవాది కోడి మోహన్ రావు మాటల్లో వెలుగొండ ప్రాజెక్టు వల్ల ఒక వైపు నీటి కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాలకు కొత్త ఆశలు పుడుతుంటే, మరోవైపు తమ పుట్టిన నేలను వదిలి వెళ్లాల్సిన ముంపు గ్రామస్తుల కళ్లలో కన్నీళ్లు కనిపిస్తున్నాయి. సుంకేసుల గ్రామ పంచాయితీ చివరి సర్పంచిగా యువకుడు గుడ్డెపోగు రమేష్ కూడ ముంపు గ్రామ చివరి పంచాయితీ ప్రెసిడెంట్ గా చరిత్రలో నిలిసిపోతారు.ఇది అభివృద్ధికి వ్యతిరేకమైన కన్నీరు కాదు. ఇది తమ గతాన్ని విడిచిపెట్టే బాధ. ఇది ప్రాజెక్టుకు వ్యతిరేకత కాదు. ఇది తమ జీవితానికి న్యాయం కావాలనే ఆకాంక్ష. ఒక మంచి ప్రాజెక్టు కేవలం నీటిని అందించేది కాదు---ప్రజల జీవితాలను కూడా గౌరవించేది. వెలుగొండ ప్రాజెక్టు నీరు వేలాది ఎకరాలకు పచ్చదనాన్ని తీసుకురావాలి. అదే సమయంలో ఆ నీటి కోసం తమ ఊరును వదిలే ముంపు గ్రామస్తుల జీవితాల్లో కూడా కొత్త వెలుగును తీసుకురావాలి. కన్న ఊరును వదిలి వెళ్లే ప్రతి కుటుంబం కన్నీటిని ప్రభుత్వం గుర్తించాలి. వారి త్యాగానికి తగిన గౌరవం, న్యాయమైన పరిహారం, సమగ్ర పునరావాసం, స్థిరమైన జీవనోపాధి కల్పించినప్పుడే ఆ అభివృద్ధి నిజమైన ప్రజా అభివృద్ధిగా నిలుస్తుంది.

ఊరు మునిగిపోవచ్చు...
ఇళ్లు మునిగిపోవచ్చు...
పొలాలు మునిగిపోవచ్చు...
కానీ ఆ ఊరి జ్ఞాపకాలు మాత్రం మునిగిపోకూడదు.
వెలుగొండ నీరు భవిష్యత్తుకు వెలుగైతే, ముంపు గ్రామస్తుల త్యాగం ఆ వెలుగుకు పునాది.



వ్యాసకర్త
కోడి మోహన్ రావు
న్యాయవాది
9441905999

# జనన మరణ నమోదుపై కేంద్రం కొత్త చట్టం

**-ఆలస్యమైతే కఠిన నిబంధనలు.**
**-ఆత్మకూరు తహసిల్దార్ రత్న రాధిక.**

ఆత్మకూరు ఆగష్టు 21 వార్త సాక్ష్యం

జనన మరణ నమోదుపై కేంద్రం కొత్త చట్టం అమలు చేసిందని ఆలస్యమైతే కఠిన నిబంధనలు ఉంటాయని ఆత్మకూరు తహసిల్దార్ రత్న రాధిక,పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాసిల్దార్ మాట్లాడుతూ ప్రజలకు మీడియా పరంగా అవగాహన కల్పించాలని తెలిపారు.భారత పార్లమెంట్ ఇటీవల ఆమోదించిన జనన,మరణాల నమోదు సవరణ బిల్లు 2026 ప్రకారం జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ నిబంధనలలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు.నకిలీ సర్టిఫికెట్లను నిరోధించడం,భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీఛీూ 2023) చట్టానికి అనుగుణంగా డేటాను సురక్షితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఘటన జరిగిన (జననం లేదా మరణం) 21 రోజులలోపు సచివాలయం, పంచాయతీ లేదా మున్సిపాలిటీ పరిధిలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు అని తెలియజేశారు.?21 రోజుల నుండి 1 సంవత్సరం వరకు నిర్ణీత రుసుము (అపరాధ రుసుము) చెల్లించి స్థానిక అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు అన్నారు.?1 సంవత్సరం నుండి 2 సంవత్సరాల వరకు నిర్ణీత రుసుము చెల్లించి,ఆర్డీఓ జిల్లా అధికారుల అనుమతితో నమోదు చేయవచ్చు అని తెలియజేశారు.?2 సంవత్సరాలు దాటితే కోర్టు ఆమోదం తప్పనిసరి అన్నారు.?జననం లేదా మరణం సంభవించి 2 సంవత్సరాలు దాటిన తర్వాత నమోదు చేయాలంటే ఇకపై నేరుగా మీసేవ లేదా సచివాలయాల్లో కుదరదన్నారు.?స్థానిక ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి ఉత్తర్వులు (కోర్ట్ ఆర్డర్ ) పొందడం తప్పనిసరనిన్నారు.?కోర్టు ఆర్డర్ వచ్చిన తర్వాత మాత్రమే సచివాలయం/ మున్సిపాలిటీ ద్వారా డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రజలం దరూ గమనించాలని కొత్త రూల్స్ పాటించి జనన మరణ సర్టిఫికెట్లు పొందాలని తెలియజేశారు.



# నందికొట్కూరు నియోజకవర్గం లో ఘనంగా ఏపీ వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామ సుబ్బయ్య జన్మదిన వేడుకలు





పాములపాడు ఆగష్టు 21 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన ఏపీ వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్,వడ్డెర సంఘం అధ్యక్షులు, స్మైల్ ఫౌండేషన్ అధినేత రామసుబ్బయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాములపాడు మండలంలో స్నేహితులు శ్రేయోభిలాషులు ఆత్మీయుల మధ్యన రామసుబ్బయ్య జన్మదినశీ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. స్నేహితుల మధ్యలో చాలా సంతోషంగా ఆనందంగా ఆప్యాయంగా అందరూ కలిసి కేక్ కటింగ్ చేసి ఒకరి ఒకరి కేక్ ఆనంద తో స్వీట్స్ తినిపించుకున్నారు. ఇలాంటి పుట్టినరోజు లు మరెన్నో జరుపుకోవాలని వడ్డెర.కార్పొరేషన మాజీ డైరెక్టర్ కి ఆ భగవంతుడు దీవెనలు ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తోటి స్నేహితులు కోరుకోవడం జరిగింది.స్మైల్ ఫౌండేషన్ వేడుకల్లో ప్రతినిధులు దూదేకుల మీరా సాహెబ్, తలముడిపి మా భాష, కాటిపోగు ప్రసాద్, ఆత్మకూరు ఆర్డబ్ల్యూఎస్ ఖాజా హుస్సేన్, వడ్డెర సంఘం ప్రతినిధులు కేక్ తినిపించి రామసుబ్బయ్యకు అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ పత్రిక రంగంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించి రాజకీయంగా వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ గా రాష్ట్రంలో ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించి తనదైన శైలి రాజకీయాలు చేసిన చరిత్ర రామసుబ్బయ్య కు తగ్గిందని కొనియాడారు ప్రస్తుతం సమాజంలో ప్రజా సమస్యలపై అలుపెరుగని రాజకీయాలు చేస్తూ ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే యువ నాయకుడు ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రామసుబ్బయ్య అని స్నేహితులు శ్రేయోభిలాషులు బంధుమిత్రులు తెలియజేశారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి









**-డోన్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నూరుల్లా,**
**-సెకండ్ బెటాలియన్ డి.ఎస్.పి మహేబూబ్ భాష**

ఆత్మకూరు ఆగష్టు 21 వార్త సాక్ష్యం

పట్టణంలోని ఎన్టీఆర్ కెవికె స్టేడియం లో శ్రీశైలం ఎమ్మెల్యే.బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ మరియు కబడ్డీ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నూరుల్లా మరియు సెకండ్ బెటాలియన్ డి.ఎస్.పి, మహేబూబ్ భాష శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ముఖాముఖిగా జడ్జి మాట్లాడుతూ అన్ని క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్,కబడ్డీ శిక్షణలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు.ఈ టోర్నమెంట్ లో గ్రామీణ క్రీడాకారులతో పాటు నంద్యాల జిల్లా లో అన్ని క్రీడల్లో ఆసక్తిగా ఉన్న క్రీడాకారులను దాదాపుగా 150 మందిని ఎంపిక చెయ్యడం గొప్ప విషయ మన్నారు. విద్యార్థులు సమాజంలో క్రమశిక్షణగా మెలగాలన్నారు. స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా మాట్లాడుతూ ఈ క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంద రూ ఈ యొక్క రాష్ట్రస్థాయి కబడ్డీ వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చెయ్యడం అభినంది ంచదగ్గ విషయమని కొనియాడారు కార్యక్రమంలో స్టేడియం ఇంచార్జి జునైద్ భాష, స్పోర్ట్స్ సెక్రెటరీ రైల్వే కృష్ణ, మహేబుబ్, ఉపేంద్ర, రాజేష్ జబ్బార్, కొలనుకొండ స్టేడియం కోచ్ ఉమా కాంత్, చలపతి డిగ్రీ కాలేజీ పల్నాడు కోచ్ నాగేళ్ల రాజా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## పారుమంచాల గ్రామంలో డి ఏ టి సి యు వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు




జూపాడుబంగ్లా ఆగష్టు 21 వార్త సాక్ష్యం

జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో విజయ మహిళా మండలిఐటిసి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెడికల్ క్యాంపును నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాం దృష్టిలో ఉంచుకొని ప్రజల వద్దకు ఆరోగ్య సేవలు అందించాలని లక్ష్యంతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారని. హెచ్ఐవి. బిబి .షుగర్. బ్లడ్ లో ఇన్ఫెక్షన్. ఇలాంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ సేవలు వినియోగించుకోవాలని మెడికల్ క్యాంపు సూపర్వైజర్ నరసింహ. ఏఎన్ఎం సంతోషమ్మ ఓఆర్ డబ్ల్యు అరుణ. కౌన్సిలర్ మల్లికా. ఎం బాలాజీ. వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోండి

**-పాములపాడు,తహసిల్దార్ జి.సుభద్రమ్మ**

పాములపాడు, ఆగష్టు 21 వార్త సాక్ష్యం



కేంద్ర రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పాములపాడు తాసిల్దార్ జి.సుభద్రమ్మ, శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశం లో తహసిల్దార్ జి.సుభద్రమ్మ మాట్లాడుతూ శనివారం,ఆదివారం, రెండు రోజులపాటు ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారి (బి ఎల్ ఓ) ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. బిఎల్ఓ లు తమ వద్ద ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8, ఫారం-8ఏ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా మరియు ఏఎస్ డిడి జాబితా తదితర వివరాలతో పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందు బాటులో ఉండి, వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని అందిస్తారనీ అన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో పేరు లేని, అర్హత కలిగిన వ్యక్తులు ఈ ప్రత్యేక ప్రచార దినాల్లో ఫారం-6 ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చు అని అన్నారు. అలాగే, ఓటర్ల జాబితాలో పేర్లు / వివరాలకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నవారు ఫారం-7 ద్వారా, వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువ ఓటర్లు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా ప్రత్యేకంగా ప్రోత్సహించాలని సూచించారు.

# వృద్ధులకు అన్నదానం



గురజాల ఆగష్టు 21 వార్త సాక్ష్యం

గురజాల మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో గురజాల మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సతీష్ ఏచూరి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వృద్ధులకు పండ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జానకిరామ్ గూడూరి, మాచర్ల నాగేశ్వరరావు, బొజ్జ గణేష్, పయ్యావుల బాబు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకురాలు గుండాల మల్లేశ్వరి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 22 ఆగష్టు 2026

## ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

-ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్ ఉమ్మర్,




ఆత్మకూరు ఆగస్టు 21 వార్త సాక్ష్యం

ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి,ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలను పరిష్కారించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం ఎస్ . ఉమ్మర్, జిల్లా ఉపాధ్యక్షులు పి . తులసిశ్వర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ కె . శ్రీనివాసులు,రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి ఉత్తీర్ణత మార్కులు అందరికీ 40 శాతం,నిర్ణయించాలి,టెట్ సిలబస్ లో వారి బోధన సబ్జెక్టు మాత్రమే ఇచ్చే విధంగా సిలబస్ మార్చాలి. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలైనా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటుచేసి 30% మధ్యంతర భృతి ప్రకటించాలి, అలాగే పెండింగ్లో ఉన్న 5 డి ఎ లను, పిఆర్సి బకాయిలు విడుదల చేయాలి ఈ సమస్యల పట్ల ప్రభుత్వము సానుకూలంగా స్పందించాలి లేదంటే భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని ప్రభుత్వం డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యు లు ఎస్. ఇక్బాల్ బాషా, ఆర్టిఎఫ్ కన్వీనర్ .పి అబ్దుల్ వహీద్,జిల్లా కౌన్సిలర్లు ఎం .రామాంజనేయులు, టికే సుబ్రహ్మణ్యం, ఎస్. రషీద్,కె . విధుభూషణం, శివ శంకర్,ఎం . చిన్న కిష్టయ్య, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల అధ్యక్షులు కె . అంబయ్య, ఆర్. వెంకటరమణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ




బాపట్ల ఆగస్టు 21 వార్త సాక్ష్యం

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ శుక్రవారం కొనసాగింది. గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 5 పరిధిలో లాజికల్ డిస్క్రెపెన్సీలు, మ్యాపింగ్ లేని కేసులకు సంబంధించి నోటీసులు అందుకున్న 133 మంది వివరాలను అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ సలీమా ఆధ్వర్యంలో జరిగిన విచారణకు నోటీసులు అందుకున్న పలువురు హాజరై తమకు సంబంధించిన వివరాలు, ఆధారాలను సమర్పించారు. సమర్పించిన పత్రాలను ఓటర్ల జాబితాలోని వివరాలు, అందుబాటులో ఉన్న రికార్డులతో అధికారులు సరిపోల్చి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సలీమా కేసుల వారీగా వివరాలను పరిశీలిస్తూ, అవసరమైన ఆధారాలను స్వీకరించారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన వారి పేర్లు ఉండేలా, వివరాల్లో ఉన్న లోపాలను నిబంధనల ప్రకారం సరిచేసే చర్యల్లో భాగంగానే విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పూండ్ల పోలింగ్ స్టేషన్ పరిధిలోని 133 కేసులను ఆధారాల మేరకు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ విచారణ నిర్వహిస్తున్నారు.

## అతిథి గృహాల్లో పోలీసుల తనిఖీలు

కర్లపాలెం ఆగస్టు 21 వార్త సాక్ష్యం



బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కర్లపాలెం మండలంలోని హోటళ్లు, లాడ్జీలు, అతిథి గృహాల్లో ఎస్ఐ ఎస్. రవీంద్ర ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో ఆయా గృహాల్లో బస చేస్తున్న వారి వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. అతిథి గృహాల నిర్వాహకులు సందర్శకుల పూర్తి వివరాలను నమోదు చేయడంతో పాటు వారి గుర్తింపు కార్డుల వివరాలను తప్పనిసరిగా రికార్డులో ఉంచాలని ఎస్ఐ సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం లేదా అసాంఘిక కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండలంలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు తరచుగా కొనసాగుతాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

## వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తే రైతుల భవిష్యత్తు, ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడతారు





-125 ఏళ్ల ఆర్.ఎ.ఆర్.ఎస్ చరిత్రను తుడిచేసే కుట్రను సహించం
-నూనెపల్లె మార్కెట్ యార్డును రాజకీయ ప్రయోజనాలకు మళ్లించొద్దు
-రైతు భూములపై రాజకీయ కన్ను, రైతుల కడుపు కొట్టి రాజకీయం చేయొద్దు
-నంద్యాలలో అఖిలపక్షం ధ్వజం

నంద్యాల ఆగస్టు 21 వార్త సాక్ష్యం

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆర్ ఏ ఆర్ ఎస్ నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలని, వ్యవసాయ పరిశోధన కోసం ఏర్పాటు చేసిన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అప్పగించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించిన రెండు ఎకరాల భూమిని వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక శుక్రవారం డిమాండ్ చేసింది. అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మిషన్ కాంపౌండ్ చర్చి సర్కిల్ లో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఐక్యవేదిక నాయకుల ఆధ్వర్యంలో నంద్యాల గాంధీచౌక్‌లో పెద్దఎత్తున ప్రజా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, న్యాయవాది శంకరయ్య, (ఎస్ డి పి ఐ),నాయకులు ఏజెస్ హుస్సేన్, క్రిష్టియన్ జేఏసీ నాయకులు జానయ్య, సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, శివరామిరెడ్డి, మాజీద్, రాజు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బొజ్జా దశరథరామిరెడ్డి ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. "ఇది కేవలం రైతుల సమస్య కాదు.. ప్రతి ఒక్కరి ఆహార భద్రతకు సంబంధించిన అంశం" అన్నారు. రైతుకు లాభం లేకపోతే వ్యవసాయం దెబ్బతింటుందని, వ్యవసాయం దెబ్బతింటే చివరకు ఆహార భద్రతే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. సుమారు 125 ఏళ్ల చరిత్ర ఉన్న RARS నంద్యాల ప్రాంత వ్యవసాయ అభివృద్ధికి, అధిక దిగుబడినిచ్చే విత్తనాల అభివృద్ధికి, విత్తన పరిశ్రమ ఎదుగుదలకు కీలకంగా పనిచేసిందన్నారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు RKVY, NABARD నిధులతో నిర్మించిన పరిశోధనా భవనాలు, Advanced Seed Laboratory ను కలెక్టరేట్ అవసరాలకు వినియోగించడం సరికాదని అన్నారు. "ఒక సంవత్సరం మాత్రమే తాత్కాలికంగా ఉంటామని చెప్పి తీసుకున్న భవనాలను ఒక్కొక్కటిగా కలెక్టరేట్ పరిధిలోకి తీసుకుంటున్నారు. ప్రజల రాకపోకలతో నిండిపో యిన ప్రాంగణంలో శాస్త్రవేత్తలు ప్రశాంతంగా పరిశోధనలు ఎలా చేస్తారు?" అని ప్రశ్నించారు. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు భూమి లేదని ప్రభుత్వం చెబుతున్న సమయంలో నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాలు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని గుర్తించి, పట్టణానికి బయటైనా నిర్మించాలని సూచించారు. RARSను బలహీన పరచడం అంటే రైతుల భవిష్యత్తును బలహీనప రచడమేనని, మార్కెట్ యార్డు భూములను రాజకీయ ప్రయోజనాలకు కాకుండా రైతుల ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు. ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని విస్తరిస్తాం ఈ కార్యక్రమం మొదటిదేనని, ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వరకు ఇటువంటి అనేక కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతామని నాయకులు తెలిపారు. రేపు నూనెపల్లె మార్కెట్ యార్డులో ప్రజలు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఆగస్టు 24న కలెక్టరేట్ లో జరిగే PGRS కార్యక్రమంలో కలెక్టర్‌కు రెండు వేర్వేరు పిటిషన్లు సమర్పించి RARS నుంచి కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డును రైతుల ప్రయోజనాల కోసం పరిరక్షించాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడిం చారు. కార్యక్రమం అనంతరం అఖిలపక్ష నాయకులు RARS విశిష్టత, వ్యవసాయ పరిశోధన ప్రాధాన్యత, RARS పరిరక్షణ, నూనెపల్లె మార్కెట్ యార్డు పరిరక్షణ అంశాలపై రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. RARS, మార్కెట్ యార్డులను ఎందుకు కాపాడుకోవాలో ప్రజలకు వివరిస్తూ ప్రజా మద్దతును కూడగట్టారు. "ఇది కొంతమంది నాయకుల సమస్య కాదు.. మనందరి బతుకుకు సంబంధించిన సమస్య. ప్రజా ఆస్తులు ప్రజల కోసమే.. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు" అని నాయకులు స్పష్టం చేశారు.

## సైనిక్ కార్యాలయానికి శ్రీకారం

బాపట్లఆగస్టు 21 వార్త సాక్ష్యం



బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఈ నెల 27న జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ప్రారంభం కానుండటం సంతోషదాయకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. బాపట్లలో కార్యాలయం ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ వి. వినోద్‌కుమార్, రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్, ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి గుణశీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ఏర్పాటుతో సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయని సాంబశివరావు పేర్కొన్నారు. సైనిక్ వెల్ఫేర్ శాఖలో సిబ్బందిని పెంచడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని గతంలో హోంమంత్రి వంగలపూడి అనితతో పాటు సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు.నూతన కార్యాలయానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మాజీ సైనికులు స్వచ్ఛం దంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. సుంకర శేషగిరిరావు బీరువా, చలికొండ వెంకట కృష్ణారావు రెండు ర్యాక్‌లు, హానరరీ కెప్టెన్ నిడమానూరు లక్ష్మీనారాయణ రెండు ఆఫీస్ టేబుళ్లు అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. సీనియర్ మాజీ సైనికులు షేక్ ఖలీల్ సైతం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.బాపట్లలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన గుణశీలకు మాజీ సైనికుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, సుంకర శేషగిరిరావు, ట్రెజరర్ షేక్ నిజాముద్దీన్, సీనియర్ మాజీ సైనికులు దూళ్ల వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల గళం వినిపించాలి

బాపట్లఆగస్టు 21 వార్త సాక్ష్యం



కృష్ణా--గుంటూరు ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా ఎం. హనుమంతరావును బలపరచాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. బాపట్లలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో హనుమంతరావు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు జడ వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కలిగి, వారి హక్కుల కోసం సమర్థవంతంగా పనిచేసే అభ్యర్థి హనుమంతరావు అని పేర్కొన్నారు. ఆయనకు ఉపాధ్యాయులంతా మద్దతుగా నిలవాలని కోరారు.మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేయగల సామర్థ్యం హనుమ ంతరావుకు ఉందన్నారు. ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు ఆయనను గెలిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూటీఎఫ్ ప్రతినిధులు కే. శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, పాపారావు, జేవీవీ ప్రతినిధులు రామారావు, భాస్కరరావు, ప్రైవేట్ టీచర్స్ నాయకులు సూర్యారావు, ప్రజా సంఘాల ప్రతినిధులు బాబూరావు, గంగయ్య, జిల్లా కమిటీ బాధ్యులు అడుగుల శ్రీనివాసరావు, రవిబాబు, సుబ్రహ్మణ్యం, ఎం. వెంకటేశ్వరరెడ్డి, మద్దాల సురేష్, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమరం.. ఉమ్మడి గుంటూరులో టెన్షన్!

-ఎన్నికలకు రంగం సిద్ధం.. ఎస్ఈసీ కసరత్తు షురూ
-పొన్నూరు విలీన పంచాయతీలపై ఇంకా ఉత్కంఠ
-బాపట్లలో స్పష్టత.. వార్డుల లెక్కలపై ఆసక్తి
-కూటమిలో జనసేనకు ఏ మున్సిపాలిటీ?
-రిజర్వేషన్లు, విలీన గ్రామాలే కీలకం



ఆగస్టు 21 వార్త సాక్ష్యం

మున్సిపల్ ఎన్నికలకు తెరలేవబోతోంది. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో రాజకీయ వేడి మొదలైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల వారీ ఓటర్ల జాబితాల ప్రక్రియ వేగం పుంజుకుంది. సెప్టెంబర్ 3 నాటికి మున్సిపల్ ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలని ఎస్ఈసీ నిర్దేశించింది. అక్టోబరులో ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే పోలింగ్ తేదీలు, నామినేషన్ల షెడ్యూల్‌తో కూడిన తుది ఎన్నికల నోటిఫికేషన్ మాత్రం ఇంకా వెలువడలేదు.

**-ఎడిటర్ నరేంద్ర...**

ఈసారి మున్సిపల్ పోరు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేవలం అధికార--ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీగా కనిపించడం లేదు. అధికార కూటమిలోనే రాజకీయ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటే.. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలి? ఏ మున్సిపాలిటీ బాధ్యత ఏ పార్టీకి ఇవ్వాలి? ఏ వార్డుల్లో ఎవరికి అవకాశం కల్పించాలి? అన్నది కీలకంగా మారనుంది. ముఖ్యంగా జనసేన ఈసారి 2024 అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములాను స్థానిక సంస్థలకు యథాతథంగా వర్తింపజేయబోమని ఇప్పటికే స్పష్టం చేసింది. పార్టీ బలం, స్థానిక సంస్థాగత నిర్మాణం ఆధారంగా వాటా కోరుతోంది.

**-నోటిఫికేషన్ కాదు.. కసరత్తు నోటిఫికేషన్!**

మున్సిపల్ ఎన్నికలపై గందరగోళానికి ప్రధాన కారణం ఇదే. ఆగస్టు 12న ఎస్ఈసీ జారీ చేసిన 401/రాజుజ-ఖీ1/2026-1 నోటిఫికేషన్ ద్వారా పట్టణ స్థానిక సంస్థల్లో ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణకు షెడ్యూల్ ఇచ్చింది. సెప్టెంబర్ 3 నాటికి వార్డువారీ ఓటర్ల జాబితాలు ప్రచురించాల్సి ఉంది. ఇది ఎన్నికల నిర్వహణకు ముందస్తు ప్రక్రియ మాత్రమే.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 100లో 87 పట్టణ స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ఇప్పటికే ముగిసింది. మరో 13 సంస్థల పదవీకాలం నవంబర్‌లో పూర్తికానుంది. కోర్టు కేసులు తదితర కారణాలతో 23 పట్టణ స్థానిక సంస్థలను ప్రస్తుత ప్రక్రియలో పక్కనపెట్టినట్లు తాజా సమాచారం. బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**-పొన్నూరు.. పంచాయతీలపై పంచాయతీ!**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం అత్యంత ఆసక్తిని రేపుతున్న అంశం పొన్నూరు. గతంలోనే పొన్నూరు మున్సిపాలిటీ పరిధిని విస్తరించేందుకు ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చింతలపూడి, పెదఇటికంపాడు, వడ్డెముక్కల, కట్టెంపూడి, ఆలూరు, కసుకర్రు గ్రామ పంచాయతీలను పొన్నూరు మున్సిపాలిటీలో విలీనం చేయాలని 2020లో ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి గెజిట్ ప్రక్రియ కూడా జరిగింది.

అయితే ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలో ఆ విలీన గ్రామాల స్థితి, వార్డుల రూపకల్పన, ఓటర్ల జాబితా, స్థానిక సంస్థ పరిధి వంటి అంశాలపై మళ్లీ చర్చ మొదలైంది. ఏ గ్రామం ఏ వార్డులోకి వస్తుంది? విలీన ప్రాంతాలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉంటుంది? పాత పంచాయతీ రాజకీయాల్లో బలంగా ఉన్న నాయకులకు మున్సిపల్ రాజకీయాల్లో ఏ స్థానం దక్కుతుంది? అన్న ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

అందుకే పొన్నూరు విషయంలో ఎన్నికల కంటే ముందు విలీన గ్రామాల వ్యవహారంపై పూర్తి స్పష్టత రావడం కీలకం. ఈ అంశం తేలకపోతే వార్డుల విభజన, రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక వరకు ప్రభావం పడే అవకాశం ఉంది.

**-బాపట్ల.. విలీన గ్రామాలపై స్పష్టత**

బాపట్ల విషయంలో పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది. గతంలో మున్సిపాలిటీ విస్తరణకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాపట్ల చుట్టుపక్కల గ్రామాలను పట్టణ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనలు, విలీన ప్రక్రియలు ఇప్పటికే చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ప్రధాన చర్చ విలీనం జరుగుతుందా లేదా అన్నదానికంటే.. ఆ పరిధి ఆధారంగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, అభ్యర్థుల ఎంపిక ఎలా ఉంటుందన్నదానిపైనే ఉంది. బాపట్ల జిల్లా అధికారిక పోర్టల్ కూడా ప్రస్తుత జిల్లా నిర్మాణం 2022లో ఏర్పడిందని స్పష్టం చేస్తోంది. పాత ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 12 మండలాలు, పాత ప్రకాశం జిల్లా నుంచి 13 మండలాలు బాపట్ల జిల్లాలోకి వచ్చాయి. దీంతో గత రాజకీయ లెక్కలతో పోలిస్తే ప్రస్తుత జిల్లా రాజకీయ భౌగోళికత పూర్తిగా మారింది.గుంటూరు నగరపాలక సంస్థలోనూ గతంలో గ్రామాల విలీనంతో వార్డుల సంఖ్య, పట్టణ పరిధి విస్తరించింది. అధికారిక జిల్లా వెబ్‌సైట్ ప్రకారం గుంటూరు కార్పొరేషన్‌లో ప్రస్తుతం 57 రాజకీయ వార్డులు ఉన్నాయి. నగర పరిధిని విస్తరించేందుకు చుట్టుపక్కల పది గ్రామాలను విలీనం చేసినట్లు జిల్లా పరిపాలన పేర్కొంటోంది.ఇక్కడ ఇప్పటికే కార్పొరేషన్ స్థాయి రాజకీయ సమీకరణాలు బలంగా ఉన్నాయి. అయితే కొత్త ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పులు, ఓటర్ల జాబితా, స్థానిక నాయకుల సామర్థ్యం కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా కూటమి పార్టీల మధ్య వార్డుల సర్దుబాటు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారనుంది.

**-మంగళగిరి--తాడేపల్లి.. రెండు ప్రాంతాలు.. ఒకే కార్పొరేషన్**

మంగళగిరి--తాడేపల్లి ప్రాంతం కూడా ఉమ్మడి గుంటూరు రాజకీయాల్లో ప్రత్యేకమైనదే. గతంలో రెండు వేర్వేరు మున్సిపాలిటీలుగా ఉన్న ప్రాంతం కార్పొరేషన్‌గా మారిన తర్వాత రాజకీయ లెక్కలు మారాయి. పట్టణ ఓటర్లతో పాటు పరిసర గ్రామాల ప్రభావం కూడా ఇక్కడ గణనీయంగా ఉంటుంది.

అమరావతి రాజధాని ప్రాంతంతో ముడిపడి ఉన్న రాజకీయ, ఆర్థిక అంశాలు ఈ కార్పొరేషన్ ఎన్నికలను మరింత ప్రాధాన్యంగా మార్చును న్నాయి. అధికార కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎంతవరకు ఉంటుందన్నది కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశంగా మారనుంది.

**-పల్నాడులో ఎవరి పట్టు?**

పల్నాడు జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్ల వంటి పట్టణాలు కీలకం. ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు అంటే స్థానిక నాయకత్వానికి పరీక్ష. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉన్న రాజకీయ సమీకరణాలు మున్సిపల్ ఎన్నికల్లో యథాతథంగా పనిచేస్తాయా అన్నది ఆసక్తికరం.

పట్టణాల్లో కౌన్సిలర్ అభ్యర్థుల వ్యక్తిగత బలం, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలు ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలుతో అనేక వార్డుల్లో అభ్యర్థుల లెక్కలు మారే అవకాశం ఉంది.

**-జనసేనకు ఏ మున్సిపాలిటీ?**

ఇదే ఇప్పుడు కూటమి రాజకీయాల్లో అసలు చర్చ. జనసేన స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 సీట్ల సర్దుబాటు ఫార్ములాను అనుసరించబోమని స్పష్టం చేసింది. పార్టీ విస్తరణ, గ్రామస్థాయి నిర్మాణం, స్థానికంగా ఉన్న బలం ఆధారంగా సీట్ల వాటా ఉండాలని కోరుతోంది.ఉమ్మడి గుంటూరు జిల్లాలో జనసేనకు ఏ మున్సిపాలిటీ కేటాయిస్తారన్నది పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఒక మున్సిపాలిటీని పూర్తిగా పార్టీకి అప్పగిస్తారా? లేక కౌన్సిలర్ వార్డుల స్థాయిలోనే సర్దుబాటు చేస్తారా? టీడీపీకి బలమైన పట్టణాల్లో జనసేనకు ఎంత మేర అవకాశం వస్తుంది? అన్నది ఇంకా తేలాల్సి ఉంది.

ఇది కేవలం సీటు కేటాయింపు సమస్య కాదు. రాబోయే స్థానిక రాజకీయాల్లో మూడు పార్టీల మధ్య శక్తిసామర్థ్యాలను నిర్ణయించే అంశం కూడా. అందుకే జనసేనకు దక్కే మున్సిపాలిటీపై ఇప్పటి నుంచే ఆశావహుల్లో పోటీ మొదలైంది.

**-సెప్టెంబర్ 3 తర్వాత అసలు లెక్కలు**

ఇప్పటి వరకు సాగుతున్న ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకం. 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 3న విడుదలయ్యే ఎస్ఐఆర్ తుది జాబితా కోసం వేచి ఉంటే ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అవుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.అందుకే సెప్టెంబర్ 3న వార్డువారీ ఫొటో ఓటర్ల జాబితాలు వెలువడిన తర్వాతే అనేక రాజకీయ లెక్కలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఏ వార్డులో ఎంత ఓటరు బలం? విలీన గ్రామాల ప్రభావం ఎంత? రిజర్వేషన్ ఎక్కడికి వస్తుంది? ఎవరికి అవకాశం ఉంటుంది? అన్నదానిపై అప్పుడే పార్టీల్లో స్పష్టత పెరుగుతుంది.

**-ఇక వార్డు వార్డుకూ వేడి!**

మొత్తానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు మరోసారి రాజకీయ వేదికను వేడెక్కించనున్నాయి. పొన్నూరులో విలీన గ్రామాలపై ఉత్కంఠ.. బాపట్లలో కొత్త పరిధి లెక్కలు.. గుంటూరులో వార్డు సమీకరణాలు.. పల్నాడులో స్థానిక ఆధిపత్య పోరు.. మంగళగిరి--తాడేపల్లిలో కూటమి బలం.. అన్నింటికంటే జనసేనకు దక్కే వాటాపై ఆసక్తి.ప్రభుత్వం ఎన్నికలకు మార్గం సుగమం చేసింది. ఎస్ఈసీ ఓటర్ల జాబితాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది. సెప్టెంబర్ 3 కీలక మైలురాయిగా మారనుంది. ఆ తర్వాత రిజర్వేషన్లు, వార్డుల లెక్కలు తేలితే రాజకీయ పార్టీల అసలు కసరత్తు మొదలవుతుంది. ఎవరి మున్సిపాలిటీ? ఎవరి వార్డు? ఎవరి అభ్యర్థి? ఇక నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి పట్టణం.. ప్రతి వార్డు.. ప్రతి విలీన గ్రామం రాజకీయ చర్చకు కేంద్రంగా మారనుంది.

## శాంతిభద్రతలపై సీఐ హరికృష్ణ కీలక సూచనలు



చందోలుఆగస్టు 21 వార్త సాక్ష్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, నిర్భయంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ బి. హరికృష్ణ సూచించారు. పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామంలో బాపట్ల రూరల్ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సీఐ హరికృష్ణ కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ నేరగాళ్ల మోసాలకు ప్రజలు బలికాకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, లింకులు, సందేశాలకు స్పందించవద్దని, బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని వివరించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు.మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసు సిబ్బంది వివరించారు. గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు, ప్రజల భద్రతకు మరింత సహకారం అందుతుందని తెలిపారు.కార్యక్రమంలో చందోలు ఎస్ఐ కె. మాధవరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ నిర్భయంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అనసూయ వ్యాఖ్యలపై నిరసన




బాపట్లఆగస్టు 21 వార్త సాక్ష్యం

'జై శ్రీరామ్' అంటూ నినదించే వారందరినీ దొంగలుగా అభివర్ణించిన సినీనటి, టీవీ యాంకర్ అనసూయ వ్యాఖ్యలను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో ఆందోళన చేపట్టారు. బజరంగ్‌దళ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు నాళం నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు అనసూయ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మత విశ్వాసాలకు సంబంధించిన నినాదా లను అవమానించే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతాయుతమైన వ్యక్తులు ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ట్రెజరర్ మద్దుల వెంకటేశ్వర్లు, హిందూ చైతన్య వేదిక కండ సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు, సాహస సంయోజక్ నాగేశ్వరరావు, భజరంగ్‌దళ్ జిల్లా నాయకుడు ఇమ్మడిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 22 ఆగష్టు 2026

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ తయారీలో దూసుకెళుతోన్న భారత్.. రెండేళ్లలో ప్రపంచంలో 20 శాతం వాటా!



ప్రపంచ స్మార్ట్‌ఫోన్ తయారీలో భారత్ వాటా మరింత పెరగనుంది. మరో ఏడాది లేదా రెండేళ్లలో ప్రపంచ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తిలో భారత్ వాటా 20 శాతానికి చేరే అవకాశం ఉందని 'వన్ వరల్డ్ ఔట్‌లుక్' నివేదిక తెలిపింది.ప్రపంచ ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థలో చైనాకు ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా భారత్ వేగంగా ఎదుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కంపెనీలు ఇతర దేశాల్లో తయారీని విస్తరిస్తున్నాయి. ఈ వ్యూహాన్ని 'చైనా ప్లస్ వన్'గా వ్యవహరిస్తున్నారు.కొవిడ్ సమయంలో సరఫరా వ్యవస్థల్లో తలెత్తిన అంతరాయాలు ఈ మార్పునకు ప్రధాన కారణంగా నిలిచాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సుంకాలు, కీలక సాంకేతికతలపై ఆంక్షలు కూడా కంపెనీలను తయారీ కేంద్రాలను విస్తరించేలా చేశాయి.2025 నాటికి చైనా, భారత్, వియత్నాం కలిసి ప్రపంచ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తిలో 90 శాతానికి పైగా వాటా కలిగి ఉన్నాయని నివేదిక తెలిపింది. ఇందులో చైనా 63 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. భారత్ వాటా 18 శాతానికి చేరింది. భారత్ వాటా వచ్చే ఒకటి, రెండేళ్లలో 20 శాతానికి పెరగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నట్లు నివేదిక పేర్కొంది. దీంతో ప్రపంచ స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రతి ఐదు ఫోన్లలో ఒకటి భారత్‌లో తయారయ్యే అవకాశం ఉంది.

## ఇండిగో వెబ్‌సైట్‌కు మళ్లీ అంతరాయం.. బుకింగ్స్‌కు బ్రేక్




దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో ఆన్‌లైన్ సేవలకు శుక్రవారం మరోసారి అంతరాయం ఏర్పడింది. దీంతో పలువురు ప్రయాణికులు విమాన టికెట్లు బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెబ్ చెక్-ఇన్ సేవలు కూడా కొంతమందికి అందుబాటులో లేకపోయాయి. మొబైల్ యాప్‌లో లాగిన్ కావడంలోనూ సమస్యలు తలెత్తినట్లు ప్రయాణికులు తెలిపారు.ఈ సమస్యపై ఇండిగో స్పందించింది. తమ ప్రధాన రిజర్వేషన్ ప్లాట్‌ఫామ్‌లో అడపాదడపా సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు వెల్లడించింది. దీనివల్ల కొందరు వినియోగదారులు ఆన్‌లైన్ సేవలను పొందడంలో ఇబ్బంది పడవచ్చని తెలిపింది. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తమ బృందాలు టెక్నాలజీ భాగస్వామితో కలిసి అత్యవసరంగా పనిచేస్తున్నట్లు ఇండిగో పేర్కొంది. అంతరాయం సమయంలో విమాన బుకింగ్ సేవలు తెరవడానికి ప్రయత్నించిన వారికి వెబ్‌సైట్‌లో 'నో డేటా అవైలబుల్' సందేశం కనిపించింది. పలువురు ప్రయాణికులు ఇండిగో అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ఫిర్యాదులు చేశారు. బుకింగ్స్ విఫలమవుతున్నాయని, వెబ్ చెక్-ఇన్ కావడం లేదని, చెల్లింపులకు నిర్ధారణ సందేశాలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు.వారం వ్యవధిలో ఇండిగో రిజర్వేషన్ వ్యవస్థలో రెండోసారి సమస్య తలెత్తడం ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండు రోజుల క్రితమే ఇదే తరహా అంతరాయం ఏర్పడింది. తాజా సమస్యకు కారణమేంటో, ఏ టెక్నాలజీ భాగస్వామితో కలిసి పరిష్కార చర్యలు చేపడుతున్నారో ఇండిగో వెల్లడించలేదు. సేవలు పూర్తిస్థాయిలో ఎప్పటికి పునరుద్ధరిస్తారన్న దానిపైనా స్పష్టత ఇవ్వలేదు.

## క్రెడిట్ కార్డు బిల్లు సెటిల్ చేస్తున్నారా?- మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడొచ్చు!



క్రెడిట్ కార్డు బిల్లు భారీగా పెరిగిపోయి.. మొత్తం చెల్లించడం కష్టంగా మారినప్పుడు బ్యాంకులు సెటిల్‌మెంట్ అవకాశం ఇస్తుంటాయి. ఉదాహరణకు రూ.1 లక్ష బకాయి ఉంటే రూ.60 వేలు చెల్లించి ఖాతాను ముగించుకోవచ్చు. వెంటనే ఆర్థిక భారం తగ్గినట్టే అనిపిస్తుంది. కానీ ఇక్కడే ఓ ముఖ్యమైన విషయం ఉంది. బిల్లు మొత్తాన్ని చెల్లించి ఖాతా మూసేయడం, తక్కువ మొత్తంతో సెటిల్ చేయడం రెండూ ఒకటి కాదు.

**-'క్లోజ్డ్'.. 'సెటిల్డ్' మధ్య తేడా**

మొత్తం బకాయిని చెల్లిస్తే క్రెడిట్ బ్యూరోలో ఖాతా సాధారణంగా 'క్లోజ్డ్'గా నమోదవుతుంది. బకాయిలో కొంత మాత్రమే చెల్లించి రుణదాత అంగీకరిస్తే 'సెటిల్డ్'గా నమోదు చేస్తారు. రుణదాతలు సెటిల్డ్ ఖాతాలను సాధారణంగా సానుకూలంగా చూడరు. అసలు బకాయి మొత్తం తిరిగి చెల్లించలేకపోయారనే సంకేతంగా పరిగణించే అవకాశం ఉంది.

**-రుణం తీసుకునేటప్పుడు ఇబ్బందులు**

సెటిల్డ్ ఖాతా మీ క్రెడిట్ ప్రొఫైల్‌పై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. భవిష్యత్తులో గృహ రుణం, వ్యక్తిగత రుణం లేదా కొత్త క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు రుణదాతలు ఈ వివరాలను పరిశీలించే అవకాశం ఉంది. గతంలో సెటిల్డ్ ఖాతా ఉండటాన్ని అధిక రుణ చెల్లింపు ప్రమాదానికి సంకేతంగా భావించవచ్చు. కొన్ని సందర్భాల్లో రుణ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం కూడా ఉంటుంది.

**-బిల్లు కట్టలేని పరిస్థితుల్లో..**

అయితే బకాయిని అలా వదిలేయడం కంటే సెటిల్‌మెంట్ మెరుగైన మార్గంగా మారొచ్చు. చెల్లింపులు ఆగిపోతే వడ్డీ, ఆలస్య రుసుములు పెరుగుతూనే ఉంటాయి. పూర్తిగా చెల్లించే పరిస్థితి లేకపోతే రుణదాతతో చర్చించి సెటిల్ చేసుకోవడం తక్షణ ఆర్థిక ఒత్తిడిని తగ్గించవచ్చు. అయితే దీని ప్రభావం భవిష్యత్తులో క్రెడిట్ పొందడంపై ఉండొచ్చని గుర్తుంచుకోవాలి.

**-తర్వాత 'క్లోజ్డ్'గా మార్చుకోవచ్చా?**

కొన్ని సందర్భాల్లో మార్గం ఉంటుంది. మిగిలిన బకాయిని తర్వాత పూర్తిగా చెల్లించి, రుణదాత నుంచి 'నో ఆబ్జెక్షన్' సర్టిఫికెట్ తీసుకోవచ్చు. అనంతరం క్రెడిట్ బ్యూరోలో వివాదాన్ని నమోదు చేస్తే.. బ్యాంకు నిర్ధారణ తర్వాత ఖాతా స్థితిని 'సెటిల్డ్' నుంచి 'క్లోజ్డ్'గా మార్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం చెల్లింపు రసీదులు, సెటిల్‌మెంట్ లేఖ, ఎన్‌ఓసీ వంటి పత్రాలను భద్రంగా ఉంచుకోవాలి.సెటిల్‌మెంట్ చేసిన తర్వాత క్రెడిట్ రిపోర్టును కూడా తనిఖీ చేయాలి. ఖాతా స్థితి, బకాయి వివరాలు ఒప్పందానికి అనుగుణంగా ఉన్నాయో? లేదో? చూసుకోవాలి. ఏదైనా తప్పుగా నమోదైతే రుణదాతను, క్రెడిట్ బ్యూరోను సంప్రదించి సరిచేయించుకోవాలి.

## వరల్డ్ ఛాంపియన్ షిప్ లో పుల్లెల గాయత్రి గోపీచంద్ దూకుడు- పతకం ఖాయం




భారత బ్యాడ్మింటన్ రంగంలో ఒకటిన్నర దశాబ్ద కాలంగా సాగుతున్న నిరీక్షణకు తెరపడింది. యువ క్రీడాకారిణులు గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ ద్వయం ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకుంది. మహిళల డబుల్స్ విభాగంలో సెమీ ఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా వీరు ఈ చారిత్రక ఘనతను సొంతం చేసుకున్నారు. ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో గాయత్రి - ట్రీసా జోడీ, చైనాకు చెందిన జియా యిఫాన్ - జాంగ్ షుక్సియాన్ జంటపై అద్భుత విజయం సాధించింది. తొలి గేమ్‌ను 16-21 తేడాతో కోల్పోయినప్పటికీ, భారత ద్వయం అసాధారణ రీతిలో పుంజుకుంది. ఆ తర్వాత రెండు గేమ్‌లను 21-15, 21-13 స్కోరుతో వరుసగా కైవసం చేసుకుని మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో సెమీస్‌లో అడుగుపెట్టిన భారత జోడీ, కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారిణులు పతకం సాధించడం గత 15 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరగా 2011లో గుత్తా జ్వాల - అశ్విని పొన్నప్ప జోడీ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డుకు ఎంపికైన గాయత్రి, ట్రీసాతో కలిసి బరిలోకి దిగి అంచనాలకు తగ్గట్టుగా రాణించింది. ఒకవేళ సెమీ ఫైనల్‌లోనూ విజయం సాధిస్తే, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా వీరు సరికొత్త చరిత్ర సృష్టిస్తారు.

# స్పోర్ట్స్

## భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టులో భారీ మార్పులు.. ఐదుగురిపై వేటు!



భారత్‌తో జరిగిన తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక, రెండో టెస్టు కోసం తమ జట్టులో భారీ మార్పులు చేసింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుతో ఆదివారం కొలంబోలో ప్రారంభంకానున్న చివరి టెస్టు కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ఈ జట్టు నుంచి ఐదుగురు ఆటగాళ్లను తప్పించి, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇద్దరు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు. గాలేలో జరిగిన తొలి టెస్టులో గాయపడిన సీనియర్ ఆటగాడు దినేశ్ చండిమాల్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన పసిందు సూరియ బండార, తాను ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో అతనిపైనా సెలక్టర్లు వేటు వేశారు. వీరితో పాటు ఓపెనర్ నిషాన్ మదుష్క, బౌలింగ్ ఆల్ రౌండర్ రమేశ్ మెండిస్, ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మదుష్కలను కూడా జట్టు నుంచి తప్పించారు. ఇటీవల భారత్-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో శ్రీలంక-ఏ జట్టుకు నాయకత్వం వహించి అద్భుత ప్రదర్శన చేసిన సహన్ అరాచ్చిగేకు సెలక్టర్ల నుంచి పిలుపు అందింది. ఆ సిరీస్‌లో అతను రెండో మ్యాచ్‌లో 127 పరుగులు, తొలి మ్యాచ్‌లో 72 పరుగులు సాధించాడు. మొత్తం రెండు మ్యాచ్‌లలో 209 పరుగులతో తన జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

## టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ టీ20 సిరీస్ తేదీలు మారే అవకాశం!



భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ తేదీలను మార్చే విషయమై ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో చర్చలు జరుపుతోంది. గణేశ్ చతుర్థి పండుగను దృష్టిలో ఉంచుకుని, ప్రేక్షకుల హాజరుతో పాటు టెలివిజన్ వీక్షకుల సంఖ్యను పెంచుకునే వ్యూహంతో ఏసీబీ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఈ సిరీస్‌ను సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఏసీబీ ఇప్పుడు ఈ తేదీలను సెప్టెంబర్ 11, 13, 14గా మార్చాలని కోరుతోంది. ఈ సిరీస్‌కు ఆఫ్ఘనిస్థాన్ ఆతిథ్యం ఇస్తుండగా, వారికి సొంతగడ్డపై అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేందుకు మైదానాలు లేకపోవడంతో భారత్‌నే వేదికగా ఎంచుకుంది."ఈ విషయంపై ఏసీబీ, బీసీసీఐతో చర్చిస్తోంది. సోమవారం నాటికి అధికారికంగా ఆమోదం లభించవచ్చు. సెప్టెంబర్ 14న ఒక మ్యాచ్ జరిగే అవకాశం ఎక్కువగా ఉంది" అని సిరీస్ ప్రసార హక్కులు పొందిన ఐటీడబ్ల్యూ యూనివర్స్ సహ-వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్ శుక్రవారం మీడియాకు తెలిపారు.మరోవైపు, ఈ మార్పుల గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధికారి ఒకరు తెలిపారు. అయితే, షెడ్యూల్ మార్పుపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఏసీబీదేనని బీసీసీఐ స్పష్టం చేసింది. "ఇది ఆఫ్ఘనిస్తాన్ నిర్ణయం, మాది కాదు. వారు తమ దేశంలో మైదానాలు లేనందున ఇక్కడ సిరీస్ నిర్వహిస్తున్నారు. కాబట్టి తుది నిర్ణయం ఏసీబీ నుంచే వస్తుంది," అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.ఈ టీ20 సిరీస్‌తో ఇరు జట్ల మధ్య మల్టీ-ఫార్మాట్ సిరీస్ పూర్తికానుంది. గత జూన్‌లో జరిగిన వన్-ఆఫ్ టెస్ట్, మూడు వన్డేల సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. రాబోయే టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుండగా, ఫ్యాన్‌కోడ్ స్ట్రీమింగ్ హక్కులను కలిగి ఉంది.

# 'స్పిరిట్'లో దీపిక 10 శాతం లాభం అడిగారా సందీప్ వంగా సోదరుడి సంచలన ఆరోపణలు



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న స్పిరిట్ సినిమా నుంచి దీపికా పదుకొణె తప్పుకోవడం ఇప్పటికే పెద్ద చర్చకు దారితీసింది. తాజాగా ఈ వివాదంపై సందీప్ రెడ్డి వంగా సోదరుడు ప్రణయ్ రెడ్డి వంగా చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. దీపిక రెమ్యునరేషన్, పని గంటలతో పాటు సినిమా లాభాల్లో వాటా కూడా అడిగారని ఆయన ఆరోపించారు.ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దీపికా పదుకొణె సినిమా లాభాల్లో 10 శాతం వాటా కోరారని చెప్పారు. ఆమె ఏదైనా డిమాండ్ చేయవచ్చని, అయితే సినిమా బడ్జెట్‌కు ఆ డిమాండ్ సరిపోవాలని అన్నారు. ఆర్థికంగా లెక్కలు సరిపోకపో వడంతో ఇతర ఆప్షన్ల కోసం వెతికామని తెలిపారు. దీపికతో సందీప్ సుమారు 18 నెలల పాటు మాట్లాడారని ప్రణయ్ తెలిపారు. సినిమా కథ, పాత్రకు సంబంధిం చిన వివరాలను ఆమెతో చర్చించామని చెప్పారు. అయితే తమ మధ్య అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు వెళ్లడంతో తాము అసంతృప్తికి గురయ్యామని ప్రణయ్ ఆరోపించారు.దీపికను మార్చడానికి ప్రధాన కారణాల్లో రెమ్యునరేషన్, పని వేళలు ఉన్నాయని ప్రణయ్ చెప్పారు. ఇది కేవలం అదనంగా రూ.5-6 కోట్లు అడిగిన వ్యవహారం కాదని స్పష్టం చేశారు.ఈ వివాదం సమయంలో సందీప్ రెడ్డి వంగా కూడా 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేశారు. పేరు చెప్పకుండా ఓ నటిని ఉద్దేశిస్తూ.. కథను నమ్మకంతో చెప్పిన తర్వాత ఆ వివరాలు బయటకు చెప్పడం సరికాదని అన్నారు.తన కథను బయటకు చెప్పడం, యువ నటిని కించపరచడం వంటి చర్యలను ఆయన ప్రశ్నించారు. "ఇదేనా మీ ఫెమినిజం?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.స్పిరిట్ నుంచి తప్పుకోవడానికి ముందు దీపిక 8 గంటలు మాత్రమే పనిచేస్తానని కోరినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గతంలో ఆమె స్పందిస్తూ.. తాను అడిగింది అన్యాయమైన డిమాండ్ కాదని చెప్పారు. మహిళా నటిగా మాత్రమే కాకుండా, చాలా మంది పురుష నటులు కూడా ఏళ్లుగా 8 గంటల షిఫ్ట్‌లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.దీపిక స్థానంలో త్రిప్తి డిమ్రీని హీరోయిన్‌గా తీసుకున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న స్పిరిట్ 2027 మార్చిలో విడుదల కానుంది.



## రజనీకాంత్ 'జైలర్ 2' నుంచి ఫస్ట్ సింగిల్.. 'అల బొలెలో' సాంగ్ ఇదిగో.. పూర్ణ స్టెప్పులు అదుర్స్!




సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. తాజాగా, చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ సినిమా నుంచి తొలి పాట 'అల బొలెలో'ను శుక్రవారం విడుదల చేసి అభిమా నులకు పండగలాంటి వార్త చెప్పింది.యువ సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరప రిచిన ఈ ఫుట్ ట్యాపింగ్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. దర్శకుడు అరుణ్‌రాజా కామరాజ్ దీనికి సాహిత్యం అందించారు. అయితే, ఈ పాటలో సంగీతం, సాహిత్యం కంటే ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సమకూర్చిన స్టెప్పులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా నటి పూర్ణ (షామ్నా కాసిం) తన అద్భుతమైన డ్యాన్స్‌తో, హావభావాలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆమె డ్యాన్స్ పాటకు ప్రత్యేక కళను తెచ్చిపెట్టింది.ఈ చిత్రంలో భాగం కావడంపై నటి పూర్ణ ఇటీవల తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "'జైలర్ 2' లాంటి భారీ చిత్రంలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఇది ఒక కల నిజమైనట్లుంది" అంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు రజినీకాంత్, దర్శకుడు నెల్సన్, అనిరుధ్, జానీ మాస్టర్‌తో పాటు చిత్ర బృందానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. గతంలో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌లో నటుడు వినాయకన్ చెప్పిన డైలాగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. "నన్ను చంపి నువ్వు ప్రశాంతంగా ఉండలేవు. నా వెనుక పెద్ద ప్రపంచం ఉంది జైలర్!" అంటూ ఆయన చెప్పే డైలాగ్, ఆ తర్వాత రజినీకాంత్ స్టైలిష్ ఎంట్రీ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ ప్రకటించగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.





## షావుకారు జానకి మృతి పట్ల జూనియర్ ఎన్టీఆర్ సంతాపం

తెలుగు, తమిళ చిత్రసీమలో తనదైన నటనతో ప్రత్యేక ముద్ర వేసిన సీనియర్ నటి 'షావుకారు' జానకి (94) మరణవార్తపై స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. విలక్షణమైన పాత్రలతో చెరగని సంతకం చేసిన జానకి గారి మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసిందని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణం, వెండితెరపై ఆమె జీవం పోసిన విలక్షణమైన పాత్రలు తరతరాల సినీ ప్రేమికుల జ్ఞాపకాల్లో ఎప్పటికీ పదిలంగా నిలిచిపోతాయని కొనియాడారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.